# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ప్రకృతి విపత్తులను తట్టుకునే మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టాలని భారతీయ జనతాపార్టీ ముఖ్య నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు.
2. తిరుపతి జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.
3. ఆన్‌లైన్‌లో నకిలీ కోర్సులపై అప్రమత్తంగా ఉండాలని యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ సూచిస్తోంది.
4. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.
5. వేసవి రద్దీ నేపథ్యంలో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని వాల్తేరు సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

==========================

పకృతి విపత్తుల కారణంగా తీవ్ర నష్టాలు తలెత్తున్నాయని, ఫలితంగా మానవాళికి ఎంతో నష్టం వాటిల్లుతోందని భారతీయ జనతాపార్టీ ముఖ్య నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. విపత్తులను సమర్థంగా ఎదుర్కొనే మౌలిక సదుపాయాల కోసం ఏర్పడిన అంతర్జాతీయ కూటమి..ఐసీడీఆర్ఐని ఉద్దేశించి ఈరోజు ఆయన దృశ్య మాధ్యమ విధానంలో ప్రసంగించారు.  విపత్తులకు తట్టుకునే మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రకృతి, విపత్తులను సరిహద్దులు లేవని, ఎప్పుడు ఏ ప్రాంతంలో సంభవిస్తాయో ఊహించలేమని నరేంద్రమోదీ అన్నారు. ప్రకృతి విపత్తుల అనంతరం ఉపశమనం, పునరావాసంతో పాటు.. మౌలిక సదుపాయాల కల్పనపై కూడా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. దేశాలు వ్యక్తిగతంగా దృఢంగా ఉన్నప్పుడు ప్రపంచం కూడా సమష్టిగా మనుగడ సాధించగలుగుతుందని నరేంద్రమోదీ స్పష్టంచేశారు.

--------------------------

ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలనే లక్ష్యంతో  ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ విధానం తీసుకొచ్చిందని అనంతపురం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో  మాట్లాడుతూ...  ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్ అనేది ఒక కీలకమైన ప్రక్రియ అని అన్నారు. పోస్టల్ బ్యాలెట్, హెూం ఓటింగ్ విషయాల్లో  ఎలాంటి సందేహం ఉన్న జిల్లా

అసెంబ్లీ స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు. అత్యవసర సేవలు అందించే 33 శాఖలకు చెందిన ఉద్యోగుల కోసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎనిమిది పోస్టల్ ఓటింగ్ సెంటర్లను రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలలో ఏర్పాటు చేశామని వినోద్ కుమార్ వివరిస్తూ...

వాయిస్.... 30 సెకన్లు....

-------------------------

తిరుపతి జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. అలాంటి పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, అవసరం మేరకు వీడియోగ్రఫీ, మైక్రో అబ్జర్వర్ నియామకం, కేంద్ర బలగాలు మోహరింపు, పోలీస్ బందోబస్తు తదితర అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఈ రోజు ఆయన జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌తో కలిసి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే నాలుగు కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయని తెలిపారు.

-------------------------

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద స్ట్రాంగ్ రూంలను సిద్ధం చేయాలని విజయనగరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూంలు, లెక్కింపు కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్లలో ఏర్పాట్లపై నోడల్, వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక కౌంటర్‌లో ఈవీఎంలు, సాధారణ కౌంటర్లలో ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరచాలని, వేసవిని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, గేటు వద్దే హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

-------------------------

సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్టణం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఓటరు అవగాహన సదస్సుకు మంచి స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో విద్యార్థినులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది హాజరయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యవస్థీకృత ఓటర్ల విద్య, ఓటర్ల భాగస్వామ్య కార్యక్రమం – స్వీప్ లో భాగంగా ఈ సదస్సు ఏర్పాటు చేశారు. సీబీసీ రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ రాజీంద్ర చౌదరిఈ సందర్భంగా మాట్లాడుతూ.... ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు.

-------------------------

ఆన్‌లైన్‌లో నకిలీ కోర్సులపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్..యూజీసీ కీలక హెచ్చరిక చేసింది. దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో గుర్తింపుపొందిన డిగ్రీ ప్రోగ్రాముల తరహాలో ఆన్‌లైన్ కోర్సులు అందిస్తామంటూ కొందరు వ్యక్తులు విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేసింది. అలాంటి ప్రకటనల్లో '10 రోజుల ఎంబీఏ' అనే అంశం తమ దృష్టికి వచ్చిందని యూజీసీ కార్యదర్శి మనీష్ జోషీ తెలిపారు. ఆన్‌లైన్‌లో డిగ్రీని అందించాలనుకునే ఏ ఉన్నత విద్యా సంస్థ అయినా తప్పకుండా యూజీసీ అనుమతి పొందాల్సి ఉంటుందని తెలిపారు. ఇలా అనుమతి పొందిన విద్యాసంస్థలు వాటి కోర్సుల వివరాలను యూజీసీ వెబ్‌సైట్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చామని ఆయన వివరించారు. ఆన్‌లైన్‌లో కోర్సులకు దరఖాస్తులు చేసుకునే ముందు వాటి చెల్లుబాటును నిర్ధారించుకోవాలని ఈ సందర్భంగా మనీష్ జోషి విద్యార్థులకు సూచించారు.

-------------------------

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఈ రోజు తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కావలి రూరల్ మండలం, ముసునూరు టోల్ ప్లాజా దగ్గర ఈ తెల్లవారు జామున లారీని అధిగమించే ప్రయత్నంలో వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. బాధితులను ఏలూరు జిల్లా కొయ్యలగూడెంకు చెందిన వారిగా గుర్తించారు.

---------------------------

వేసవి రద్దీ నేపథ్యంలో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని వాల్తేరు సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. 08557 నెంబరు ప్రత్యేక రైలు ఈ నెల 27వ తేదీ నుంచి జూన్ 29వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 7 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8గంటల 45 నిమిషాలకు ఎగ్మోర్ చేరుకుంటుందని.. తిరుగు ప్రయాణంలో 08558 నెంబరు ప్రత్యేక రైలు ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ఎగ్మోర్‌లో బయలుదేరి రాత్రి 10 గంటల 35 నిమిషాలకు విశాఖపట్నం చేరుతుందని అన్నారు. 08555 నెంబరు ప్రత్యేక రైలు ఈ నెల 28 నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతి ఆదివారం రాత్రి 11 గంటల 50 నిమిషాలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటల 35 నిమిషాలకు హతియా చేరుతుందని వెల్లడించారు. 08556 నెంబరు ప్రత్యేక రైలు ఈ నెల 29వ తేదీ నుంచి జులై 1వ తేదీ వరకు ప్రతి సోమవారం సాయంకాలం 4 గంటలకు హతియాలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటల 50 నిమిషాలకు విశాఖపట్నం చేరుకుంటుందని త్రిపాఠి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 20 సెకన్లు....

---------------------------

వేసవిలో రైలు ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఐఆర్‌సీటీసీతో కలిసి తక్కువ ధరకే నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు ఎకానమీ మీల్స్ పేరుతో విజయవాడ రైల్వే అధికారులు కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారు. ముఖ్యంగా జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి కోసం బోగీల వద్దే నేరుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రెండు రకాల భోజనాలను అందిస్తున్నారు. ఈ ప్రత్యేక కౌంటర్లు విజయవాడతో పాటు రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. వేసవి పూర్తయ్యే వరకు ఇవి అందుబాటులో ఉంటాయి. ఎకానమీ మీల్స్ ప్యాకెట్ 20 రూపాయలు, స్నాక్స్ మీల్స్ 50 రూపాయలకే అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డివిజినల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఆనందరావు పాటిల్ ప్రయాణికులను కోరారు.

---------------------------

తిరుమలలో భక్తుల రద్దీ తగ్గుముఖం పట్టింది. శ్రీవారి దర్శనానికి భక్తులను నేరుగా క్యూలైన్‌లో పంపుతున్నారు. స్లాటెడ్ సర్వ దర్శనం టికెట్ లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి ఐదు గంటల సమయం పడుతోంది. కాగా.. శ్రీ వేంకటేశ్వరస్వామిని నిన్న 60 వేల 371 మంది దర్శించుకోగా 20 వేల 301 మంది తలనీలాలు సమర్పించారు.

=====================